


బీజేపీ వైపు ఎంపీ చూపు?

- రెండు నెలల క్రితం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన వెంకటేశ్ నేత
- టికెట్ దక్కకపోవడంతో పార్టీ కార్యక్రమాలకు దూరం
- టికెట్ ఇస్తే బీజేపీలో చేరేందుకు ప్రతిపాదన

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు బొర్లకుంట వెంకటేశ్ నేత బీజేపీ వైపు చూస్తున్నారు. తన రాజకీయ భవిష్యత్ దృష్ట్యా బీజేపీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. టికెట్ ఇస్తే బీజేపీలో చేరతానని ఆ పార్టీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిసి ప్రతిపాదన పెట్టారని సమాచారం. దీంతో పెద్దపల్లి అభ్యర్థిగా ప్రకటించిన గొమాసే శ్రీనివాస్‌ను మార్చి వెంకటేశ్ నేతకు టికెట్ ఇస్తారనే ప్రచారం జరుగుతున్నది. ఎక్సైజ్ శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన వెంకటేశ్ నేత రాజకీయాలపై మక్కువతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన ఓటమి చెందారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ ఎంపీ వివేక్‌కు టికెట్‌ను నిరాకరించిన బీఆర్ఎస్ పార్టీ అప్పటికప్పుడే వెంకటేశ్ నేతను పార్టీలో చేర్చుకుని ఎంపీ టికెట్ ఇవ్వడంతో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి ఆగం చంద్రశేఖర్‌పై గెలుపొందారు. అప్పటినుంచి ఆయన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ, పార్టీ ఆదేశాల మేరకు పార్లమెంట్‌లో పలు ప్రశ్నలను లేవనెత్తారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి, రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చే విషయమై సహచర ఎంపీలతో కలిసి పోరాటం చేశారు. అయితే బీఆర్ఎస్‌లో ఆ పార్టీ అధినేత కేసీఆర్ పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలకు తగిన ప్రాధాన్యం లేకుండా చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎమ్మెల్యేలనే బాధ్యులుగా చేశారు. పార్లమెంట్ సభ్యులు తన పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించాలంటే అక్కడి పార్టీ ఎమ్మెల్యేలు గానీ, నియోజకవర్గ ఇన్‌చార్జీలను సంప్రదించకుండా పర్యటించే అవకాశం లేకుండా చేయడంతో ఎంపీలు రాజకీయంగా స్వతంత్రంగా పట్టు సాధించలేకపోయారు. నవంబరు, డిసెంబరు మాసాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ స్వీప్ చేసింది. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో బొర్లకుంట వెంకటేశ్ నేతకు బదులు మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు కొప్పుల ఈశ్వర్‌కు పార్టీ టికెట్ ఇవ్వాలని అధినేత నిర్ణయించారు. ఆ మేరకు ఆయనకు సంకేతాలు ఇవ్వడంతో వెంకటేశ్ నేత తనకు టికెట్ రాదని గ్రహించి బీజేపీ లేదా కాంగ్రెస్ పార్టీలో చేరాలని ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో ఆయన రెండు మాసాల క్రితం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన చేరికతో పెద్దపల్లి పార్టీ టికెట్ వెంకటేశ్ నేతకే దక్కనున్నదని, పార్టీ టికెట్ ఇస్తామని హామీ ఇచ్చిన తర్వాతనే ఆయన పార్టీలో చేరారనే ప్రచారం జరిగింది. ఆయన చేరిన తర్వాత కొద్ది రోజుల తర్వాత మాజీ ఎంపీ గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ పేరును పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. దీంతో ఖంగుతిన్న వెంకటేశ్ నేత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరిన నాటి నుంచి ఇప్పటివరకు నియోజకవర్గంలో అడుగు పెట్టకపోవడం గమనార్హం.

● పార్టీ పెద్దల వద్ద ప్రతిపాదన..

వంశీకృష్ణకు టికెట్ ఇవ్వడాన్ని మాదిగ సామాజిక వర్గానికి చెందిన పార్టీ నాయకులు, మాదిగ కుల సంఘాలు వ్యతిరేకించడంతో అభ్యర్థిని మారుస్తారేమోననే ఆశలు టికెట్ ఆశించిన నేతలందరిలో మొలకెత్తాయి. కానీ పార్టీ అవేమి పట్టించుకోలేదు. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, పార్టీ క్యాడర్ అంతా వంశీకృష్ణ గెలుపు కోసం పనిచేయాలని అధిష్ఠానం ఆదేశించింది. కానీ వెంకటేశ్ నేత మాత్రం నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడడం లేదు. అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కకపోవడంతో ఆయన ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తన రాజకీయ భవిష్యత్ దృష్ట్యా బీజేపీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ నియోజకవర్గం నుంచి బీజేపీకి సరైన అభ్యర్థి లేకపోవడంతో పార్టీలో చేరిన కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ కార్యదర్శి గొమాసే శ్రీనివాస్‌కు బీజేపీ టికెట్ ప్రకటించింది. ఆయన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ప్రోద్బలంతో టికెట్ సాధించి పదిహేను రోజుల నుంచి నియోజకవర్గంలో ముమ్మరంగా పర్యటిస్తున్నారు. పార్టీ నాయకులు, క్యాడర్‌ను కలవడంతో పాటు వివిధ సంఘాలను కలిసి తనను గెలిపించేందుకు కృషి చేయాలని కోరుతున్నారు. గొమాసె శ్రీనివాస్, తన సామాజిక వర్గం నేతకాని కావడంతో బీజేపీ టికెట్ తనకు ఇవ్వాలని వెంకటేశ్ నేత బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిసి ప్రతిపాదన పెట్టారని సమాచారం. దీంతో ఆ పార్టీ పెద్దపల్లి అభ్యర్థి గొమాసే శ్రీనివాస్ పక్కన పెట్టి వెంకటేశ్ నేతకు టికెట్ ఇస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు గట్టి పోటీనిస్తారా లేదా అని రహస్యంగా సర్వే చేయిస్తున్నట్లుగా తెలుస్తున్నది. మరోవైపు పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ప్రచార సామగ్రిని అన్ని నియోజకవర్గాలకు సరఫరా చేయగా, పెద్దపల్లి నియోజకవర్గానికి సరఫరా చేయలేదని తెలుస్తున్నది. ఒకవేళ బీజేపీ టికెట్ ఇస్తే తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని వెంకటేశ్ నేత భావిస్తున్నారు. ఒకవేళ బీజేపీ అందుకు నిరాకరిస్తే మాత్రం ప్రస్తుతం కొన్ని రోజులు సైలెంట్‌గానే ఉండే యోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది.

జిల్లాకు చేరిన ఎన్నికల వ్యయ పరిశీలకుడు



వ్యయ పరిశీలకుడితో సమావేశమైన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో అభ్యర్థుల ఎన్నికల ప్రచార ఖర్చులు పరిశీలించేందుకు వ్యయ పరిశీలకుడు సమీర్ నైరంతర్యా జిల్లాకు చేరుకున్నారు. గురువారం ఉదయం ఆయన కలెక్టర్ కార్యాలయానికి చేరుకోగా ఆయన స్వాగతం పలికారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ జేఅరుణశ్రీతో సమావేశమయ్యారు. జిల్లాలో ఎన్నికల ఖర్చుల నమోదు కోసం ఏర్పాటుచేసిన ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్సు, వీడియో సర్వేలెన్సు, వీడియో వ్యూయింగ్ బృందాలు వాటి పనితీరు తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. అనంతరం సమీకృత జిల్లా ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకుడు పరిశీలించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై, టోల్‌ఫ్రీ నంబర్, సి విజల్‌యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను కంట్రోల్ రూమ్ ద్వారా క్షేత్రస్థాయి సిబ్బందికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ పరిష్కరిస్తున్నామని కంట్రోల్‌రూమ్ నోడల్ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీవో శ్రీమాల, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, జిల్లా ఉపాధి అధికారి వైతిరుపతిరావు, సోషల్ మీడియా ఇన్‌చార్జీ నరహరి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 18 : ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుంచి మే 2వరకు జరిగే ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో ఓపెన్ పది తరగతి పరీక్షల నిర్వహణ కోసం 2 కేంద్రాలు, ఓపెన్ ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం 3 కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలుచేయాలని, డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా తనిఖీలు నిర్వహించాలని, ప్రశ్న పత్రాల తరలింపు, పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, పరీక్షల సమయంలో విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, పెద్దపల్లి మునిసిపల్ కమిషనర్ వెంకటేష్, పోలీస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ఓదెల, ఏప్రిల్ 18: మండల కేంద్రంతోపాటు మడక, గుంపుల గ్రామాల్లో గురువారం డబ్ల్యూడబ్ల్యూఎఫ్, బీసీఐ కేశవపూర్ రైతుల ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో ఎరువుల వాడకం, పిచికారి విధానం పై అవగాహన కల్పించారు.

భూగర్భ జలాలు పెంపొందించడం అందరి బాధ్యత

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఇంకుడు గుంతల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కలెక్టర్

పెద్దపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను పెంపొందించడం మనందరి బాధ్యత అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్ ప్రాంగణంలో అదనపు కలెక్టర్ జె అరుణశ్రీతో కలిసి ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో కురిసే ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసి పట్టుకుని భూగర్భ జలాలను పెంపొందించుకోవడం చాలా ముఖ్యమని అన్నారు. కలెక్టరేట్ వద్ద వర్షపు నీటిని ఇంకేలా చేసేందుకు వీలుగా 19 చోట్ల ఇంకుడు గుంతలు నిర్మించాలని గుర్తించామన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి ఈ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వాటర్ హార్వెస్టింగ్‌లో భాగంగా మనమంతా ఇంకుడుగుంతలను నిర్మించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో ఆర్ రవీందర్, డీపీవో ఆశాలత, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కొరత నివారణకు చర్యలు చేపట్టాలి

- జడ్పీ సీఈవో నరేందర్

ఓదెల, ఏప్రిల్ 18 : వేసవి ఎండలు ఉధృతం అవుతున్నందున అన్ని శాఖల అధికారులు తాగునీటి కొరత నివారణకు చర్యలు చేపట్టేందుకు సిద్ధం కావాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నరేందర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన తనిఖీ నిర్వహించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ మే నెలలో ఎండలు తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని, ఇప్పటినుంచి తాగునీటి సమస్యలున్న గ్రామాల్లో ముందస్తుగా గుర్తించాలన్నారు. అలాగే వారసంతలు,మార్కెట్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా మానేరు పరివాహక గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా ఎక్కువ దృష్టి పెట్టాలని కోరారు. ఈ సమయంలో అధికారులంతా ఎండలకు తమకు తాము జాగ్రత్తలు తీసుకుంటూనే తాగునీటి కొరత నివారణకు సంయుక్తంగా చర్యలు చేపట్టాలని కోరారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో సమస్యలు గుర్తించి పరిష్కారం కోసం అంచనా ప్రణాళికను సిద్ధం చేసి నివేదికలను పంపించాలన్నారు. ముందస్తుగా మండలంలో ప్రతి పాఠశాలను సందర్శించాలని, ఆదేశాలను, సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో సమస్యలు అలాగే ఉంటే మండలంలోని అన్ని శాఖల అధికారులు బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతి, కార్యాలయ పర్యవేక్షకులు శ్రీధర్, మిషన్ భగీరథ ఏఈఈ స్రవంతి, ఎంపీవో భాస్కర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొదలైన నామినేషన్ల పర్వం

- తొలిరోజు నాలుగు దాఖలు - అందరూ స్వతంత్ర అభ్యర్థులే..
- నేడు బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల నామినేషన్
- పెద్దపల్లిలో మాజీ మంత్రి కేటీఆర్ రోడ్‌షో



నామినేషన్ పత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్

పెద్దపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ (ఎస్సీ రిజర్వుడు) నియోజకవర్గ స్థానానికి తొలిరోజు అయిన గురువారం నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఉదయం 11 గంటలకు ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఎన్నికల నోటిఫికేషన్‌ను జారీచేశారు. అనంతరం దూడ మహిపాల్ (స్వతంత్ర), దుర్గం రాజ్‌కుమార్(స్వతంత్ర), నూకల నవీన్(స్వతంత్ర), అక్కపాక తిరుపతి (స్వతంత్ర) ఒక సెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్ల దాఖలు గడువు ఉంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు తొలి రోజు ఎవరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ ఈనెల 24వ తేదీన భారీ ర్యాలీగా తరలివచ్చి నామినేషన్ దాఖలు చేయనుండగా, 19న ఒక సెట్ దాఖలు చేయనున్నారు. ఈనెల 19న బీఆర్ఎస్ అభ్యర్థి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ర్యాలీగా వచ్చి నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరుకానున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం గల బస్టాండ్ చౌరస్తాలో రోడ్ షో నిర్వహించి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. అలాగే బీజేపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్ కూడా ఈనెల 19న ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. అభ్యర్థులంతా మంచి ముహూర్తం చూసుకుని నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. నామినేషన్లు స్వీకరించే జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం వద్ద ప్రధాన గేటు నుంచి మొదలుకుని రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు పోలీసులు మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు.

ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించాలి

- జిల్లాలో ప్రతి రోజూ 27 వేల మందికి పనులు - రోజుకు రూ.250 దక్కేలా చూడాలి
- పని ప్రదేశాల వద్ద నీడ, నీటి వసతి ఏర్పాటు - జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్

సుల్తానాబాద్, ఏప్రిల్ 18: జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను మరింత ఎక్కువ మంది కూలీలకు అవకాశం కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సుల్తానాబాద్, జూలపల్లి, ఏలిగేడు, ఓదెల మండలాలకు చెందిన ఉపాధిహామీ పథకం ఏపీవోలు, టీఏలు ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా డీఆర్‌డీవో రవీందర్ రాథోడ్ మాట్లాడుతూ ఈ వేసవిలో గ్రామాలలో వ్యవసాయ కూలీలకు ఎలాంటి కూలీ చేసుకునే అవకాశాలు ఉండవు కనుక ఉపాధిహామీ పథకం ద్వారా అనేక పనులు గుర్తించి వారికి పనులు కల్పించాలన్నారు. ఈ విషయంలో గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ రోజు ఉపాధి హామీ పనుల కింద 27వేల మందికి పని అవకాశం కల్పించామన్నారు. అడిగిన ప్రతీ ఒక్కరికి కూలీ పని కల్పించాలని అన్నారు. ఉపాధిహామీ పనులకు సంబంధించి కూలీ రేట్లను ప్రభుత్వం ఇటీవల 300 రూపాయలకు పెంచిందని, జిల్లాలో కనీసం ఒక్కొక్కరికి 250 రూపాయలు అయినా వచ్చేలా వారితో పనులు చేయించుకోవాలని అన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో 200 మందికి మించి కూలీలను గుర్తించి వారికి పనులు ఇవ్వాలని, రోజు వారి రూ.250 గిట్టుబాటు అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఓవరాల్‌గా ప్రతి రోజు 132 మందికి అవకాశం కల్పిస్తున్నారని, ఈ సంఖ్య ఈ వేసవిలో కనీసం రెండు వందలకైనా చేరాలన్నారు.

వేసవిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..

ఎండలు మండిపోతున్న సందర్భంగా పని ప్రదేశాల వద్ద కూలీలకు నీడ ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే కూలీలకు తాగునీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. నీడ, నీటి వసతులను ఆయా గ్రామపంచాయతీలు కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో ఏపీడీ సత్యనారాయణ, ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, హెచ్ ఆర్ మేనేజర్ రమేష్, ఏపీవోలు మల్లేశ్వరి జేఈలు, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

బీ ఫారం అందుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి ఈశ్వర్



కేసీఆర్ నుంచి బీ ఫారం అందుకుంటున్న కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీ అధినేత కేసీఆర్ చేతుల మీదుగా బీ ఫారం అందుకున్నారు. రాష్ట్రంలోగల 17 పార్లమెంట్ నియోజకవర్గాల అభ్యర్థులకు ఒకేరోజు కేసీఆర్ బీ ఫారాలతో పాటు ఎన్నికల ఖర్చు కోసం 95లక్షల రూపాయల చెక్కును కూడా అందజేశారు. ఆయన వెంట ఎమ్మెల్సీ తాని పర్తి భానుప్రసాదరావు,జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ డాక్టర్ చిరుమల్ల రాకేష్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఓదెల జడ్పీటీసీ సభ్యుడు గంట రాములుయాదవ్, పార్టీ నాయకులు ఓరుగంటి రమణారావు తదితరులు ఉన్నారు.





రూ.7,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 18: జమ్మికుంట వ్యవసా య మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,800 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 30మంది రైతులు 457క్వింటాళ్ల విడి పత్తి, ఒక రైతు మూడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,300, కనిష్ఠ ధర 6వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు



పట్టుబడిన రేషన్ బియ్యం లారీ

హుజూరాబాద్, ఏప్రిల్ 18: పట్టణంలోని వరంగల్ రోడ్డులోని పరకాల క్రాస్ రోడ్డు వద్ద ఈ నెల 10న చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుబడ్డ రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు. వాహన తనిఖీల్లో హనుమకొండ జిల్లా పరకాలలోని ఓ రైస్ మిల్లు నుంచి గుజరాత్‌కు ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 350 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. పట్టుబడిన బియ్యాన్ని ల్యాబ్‌కు పంపించగా గురువారం రేషన్ బియ్యంగా అధికారులు గుర్తించారు. బియ్యం తరలిస్తు న్న ఇద్దరిపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ డీటీలు వినోద్, వసంతరావు తెలిపారు.




















ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలి మృతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 18: మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలో గుండవేణి చిన్నక్క (98) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు చేదబావిలో పడి మృతి చెందినట్లు పోలీసులు, గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... గుండవేణి చిన్నక్క బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు ఇంటి సమీపంలో కూర్చొని ముచ్చటించుకుటున్న సమయంలో ఆరుబయటకు వచ్చింది. చిన్నక్కకు సరిగా కళ్లు కనబడక పోవడంతో ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. స్థానికుల సహాయంలో కుటుంబ సభ్యులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ లాభం లేకుండా పోయినట్లు బంధువులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ కిరణ్‌కుమార్ పరిశీలించారు. చిన్నక్క కుమారుడు రాజలింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 18: మండలంలోని గుమ్లాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పడి గ్రామానికి చెందిన అడ్లగట్ల రాజేశం (60) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశం కొన్ని రోజులగా మతిస్థిమితం లేక తిరుతుండేవాడని తెలిపారు. ఈ నెల 17వ తేదీన ఉదయం ఇంటి నుంచి వెళ్లి ఇంటికి రాలేదని తెలిపారు. స్థానిక రైతులు గురువారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్థుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. గ్రామానికి చెందిన అడ్లగట్ల రాజేశంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అడ్లగట్ల రాజేశం భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 18: కరీంనగర్ రూరల్ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన గంటల మనీష్‌రెడ్డి(31) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గంటల గోపాల్‌రెడ్డి ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొంది ఇంటి వద్దనే ఉంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కొడుకులున్నారు. చిన్న కొడుకు మనీష్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా వర్క్‌ఫ్రం హోంగా పనిచేస్తున్నాడు. మనీష్‌రెడ్డి తల్లికి కంటి ఆపరేషన్ నిమిత్తం ఆమెతోపాటు గోపాల్‌రెడ్డి బుధవారం ఉదయం 6 గంటలకు వరంగల్‌కు వెళ్లారు. ఆ రోజు మధ్యాహ్నం మనీష్‌రెడ్డి సమీపంలోని తన పెదనాన్న ఇంటి వద్ద భోజనం చేసి తిరిగి ఇంటికి వచ్చాడు. గురువారం 12 గంటలకు వరంగల్ నుంచి తిరిగి వచ్చిన గోపాల్‌రెడ్డి ఇంటికి తాళం వేసి ఉండటంతో తాళం పగులగొట్టి లోపలికి వెళ్లారు. ఇంట్లో మనీష్‌రెడ్డి మృతదేహం ఉరికి వేళాడుతూ కనిపించింది. తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని, తనే జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నానని ఒక సూసైడ్ లెటర్ టేబుల్‌పై ఉన్నట్లు గుర్తించారు. తన కొడుకు కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా ఉన్నాడని ఈ క్రమంలోనే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి గోపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

హార్వెస్టర్‌లో ఇరుక్కుని తెగిన చేయి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 18: రైతు హార్వెస్టర్ ద్వారా పొలం కోస్తుండగా ప్రమాదవశాత్తు హార్వెస్టర్‌లో చెయ్యి ఇరుక్కుని తెగిపోయిన సంఘటన మండలంలోని ఇదులాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వంగల సదాశివరెడ్డి గురువారం పొలం కోస్తూ వరి గొలుసులు హార్వెస్టర్‌లో వేస్తుండగా ప్రమాదవశాత్తు కుడి చేయి హార్వెస్టర్‌లో ఇరుక్కుని తెగిపోయింది. తోటి రైతులు వెంటనే తెగిన కుడిచేయితో పాటు గాయాలపాలైన సదాశివరెడ్డిని మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు.

ఐదుగురు రౌడీషీటర్ల బైండోవర్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యగా ఐదుగురు రౌడీషీటర్లను తహసీల్దార్ ఎదుట హాజరుపరచి బైండోవర్ చేశామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన రౌడీషీటర్లు హస్తపురం విష్ణు, హస్తపురం ఆంజనేయులు, మేక శివకుమార్, హస్తపురం పవన్ కుమార్, హస్తపురం వంశీలను బైండోవర్ చేశామని పోలీసులు తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుడిపై కేసు నమోదు

గంభీరావుపేట, ఎప్రిల్ 18: బీఆర్‌ఎస్ నాయకుడు కమలాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. కమలాకర్‌రెడ్డి తన భూమి కాకున్నా తనసొంత భూమి అని చెప్పి దుబ్బాక మండలం నగరం గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తికి అమ్మాడని ఎస్‌ఐ రాంమోహన్ వెల్లడించారు. మొదటి కిస్తీ కింద భూమి కొనుగోలు చేసిన రాములు కమలాకర్‌రెడ్డికి 2 లక్షల రూపాయలు కూడా ఇచ్చాడన్నారు. ఆ భూమి కమలాకర్‌రెడ్డికి కాదని తెలిసి రాములు తాను ఇచ్చిన డబ్బులు వాపస్ ఇవ్వమని అడిగితే కమలాకర్‌రెడ్డి ఇవ్వడం లేదని రాములు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. రాములు ఫిర్యాదు మేరకు కమలాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే అదే భూమికి సంభందించి కమలాకర్‌రెడ్డిపై కేసు నమోదు అయినట్టు, బాధితులు ఇంకెవరైనా ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ రాంమోహన్ సూచించారు.

లేగదూడలపై కుక్కల దాడి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 18: మండలంలోని పెగడపల్లిలో గురువారం పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. దారివెంట వెళ్లే వారిపై దాడిచేయడంతో పాటు ఇళ్ల వద్ద కట్టేసిన లేగదూడలపై దాడి చేశాయి. దీంతో గ్రామస్థులు కుక్కలను కర్రలతో తరిమివేశారు. గ్రామంలో కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

గంభీరావుపేట, ఏప్రిల్ 18: గంభీరావుపేట మండల కేంద్రానికి సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నట్టు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు తనిఖీ చేయగా, ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ కన్పించారన్నారు. వారిని అదుపులోకి తీసుకుని 4,360 రూపాయలను, ఐదు సెల్‌ఫోన్లు, మూడు బైకులను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రాంమోహన్ వెల్లడించారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు

రుద్రంగి మార్చి 18: అటవీ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్న ఫారెస్ట్ అధికారులపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల ఎస్సై అశోక్ తెలిపారు. రుద్రంగి మండలం అడ్డబోరు తండా గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు మంగళవారం రాత్రి గస్తీ నిర్వహించారు. రాత్రి 7 గంటల సమయంలో అడ్డబోరు తండా గ్రామానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బాలకృష్ణ, వాచర్ రాజుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు రాళ్లతో దాడి చేశారు. దీంతో బాలకృష్ణ, రాజులకు గాయాలు అయ్యాయి. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతోష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల ఎస్సై అశోక్ తెలిపారు.

మృతదేహం గుర్తింపు

ఏసీసీ, ఏప్రిల్ 18: మంచిర్యాల బస్టాండ్ ఆవరణలో ఈ నెల 16న రాత్రి మృతదేహం ఆచూకీ గుర్తించినట్లు ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు పెద్దపల్లి జిల్లా గౌరెడ్డిపేట్ గ్రామానికి చెందిన కొమ్ము రాజేందర్ (33) మంచిర్యాలలోని స్నేహితున్ని కలవడానికి వచ్చి వడదెబ్బ తగిలి మృతిచెందాడన్నారు. వ్యవసాయం చేసి జీవించే రాజేందర్ అవివాహితుడని తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి బాలిక మృతి

వీణవంక, ఏప్రిల్ 18: వీణవంక మండలంలోని గంగారం గ్రామంలో గురువారం వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడి దేవరకొండ పార్వతి (13) అనే బాలిక మృతి చెందింది. నెల్లూరు జిల్లా కందుకూరు గ్రామానికి చెందిన దేవరకొండ శ్రీనివాస్ బాతులు పెంచుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రస్తుతం యాసంగి కోతలు ఉన్నందున నెల రోజుల క్రితం గంగారం గ్రామానికి కుటుంబంతో సహ వచ్చాడు. బాతులను పొలాల్లో మేతకు తీసుకెళుతున్నారు. గురువారం బాతులను కుటుంబ సభ్యులు మేతకు తీసుకెళ్లారు. ఆ సమయంలో పార్వతికి దాహం వేయడంతో గంగారం గ్రామంలోని గూడేపు తిరుపతిరెడ్డి వ్యవసాయ బావిలో నీరు తాగేందుకు దిగింది. ఈ క్రమంలో పార్వతి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై తోట తిరుపతి కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొడిమ్యాల, ఏప్రిల్ 18: మండలంలోని నల్లగొండ శివారులో మామిడి తోట పక్కన గుట్టపైన గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉండి నీలి రంగు జీన్ ప్యాంట్, మెడలో మల్లన్న స్వామి తాడు ధరించిన పురుష మృతదేహం ఉందని గ్రామ ప్రత్యేక అధికారి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సుప్రీంకోర్టును అవమానించేలా మంత్రి పొన్నం వ్యాఖ్యలు

● బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 18: సుప్రీంకోర్టును అవమానించేలా మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలు ఉన్నాయని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్‌కుమార్ అన్నారు. గురువారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లిక్కర్ స్కాం నిందితుడు, వ్యాపార వేత్త శరత్‌చంద్రారెడ్డి బీజేపీకి 500 కోట్ల ఎలక్టోరల్ బాండ్‌లు ఇవ్వగానే బెయిల్ వచ్చిందంటూ మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పొన్నం వ్యాఖ్యలను న్యాయస్థానం సుమోటాగా తీసుకుని ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎలక్టోరల్ బాండ్స్‌కు, బెయిల్‌కు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. దేశంలో ఏ సర్వేలు చూసినా బీజేపీకి 400 సీట్లు వస్తాయని తేలడంతో కాంగ్రెస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ జాతీయ పార్టీలతో పాటు స్థానిక పార్టీలకు సైతం వచ్చాయన్నారు. రాష్ట్రంలో బండి సంజయ్ పోరాటంతోనే కేసీఆర్‌పై వ్యతిరేకతతో ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లు వేశారన్నారు. అంతే తప్ప పొన్నం ప్రభాకర్ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఏనాడూ పోరాటం చేయలేదన్నారు. కరీంనగర్ ఎంపీ ఎన్నికల్లో బండి సంజయ్ 5 లక్షల మెజారిటీతో గెలువబోతున్నారని తేలడంతో పొన్నంకు భయం పట్టుకుందని కుమార్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప మాట్లాడుతూ పొన్నం మంత్రి కాగానే తన స్థాయిని తానే తగ్గించుకునేలా మాట్లాడుతున్నారని విమర్శించారు.


మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

కరీంనగర్‌లో ప్రజల్లో స్థానం లేదని పొన్నం అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ పారిపోయాడన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్ మాట్లాడుతూ బండి సంజయ్ చేసిన పోరాటాలతోనే కేసీఆర్ సర్కార్‌ను ప్రజలు గద్దె దించారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కుమ్మరి శంకర్, కరండ్ల మధూకర్, రమణారెడ్డి, సొల్లు అజయ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

- ప్రకాశం జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తింపు

మానకొండూర్, ఏప్రిల్ 18: మానకొండూర్ మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామ శివారులో కాకతీయ కాల్వ వద్ద బుధవారం మృతి చెందిన వ్యక్తి ఆచూకీ గురువారం లభ్యమైంది. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా దొనకొండ మండలం భూమనపల్లి గ్రామానికి చెందిన మురికిపూడి చెన్నయ్య (36) అనే వ్యక్తి మేస్త్రీ పని నిమిత్తం శ్రీను అనే కాంట్రాక్టర్ వద్దకు కరీంనగర్‌కు వచ్చాడు. మద్యానికి బానిసైన చెన్నయ్య ఈ నెల 14నుంచి పనికి వెళ్లలేదు. బుధవారం మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామ శివారులో కాకతీయ కాల్వ వద్ద స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుర్తు తెలియని మృతదేహం లభ్యం కావడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. గురువారం చెన్నయ్య కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. చెన్నయ్య వడదెబ్బతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

సాయ్ క్రీడా హాస్టల్‌కు ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 18 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లాలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హ్యాండ్ బాల్ క్రీడా హాస్టల్‌కు ఉమ్మడి జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. గత నెలలో జరిగిన సాయ్ హ్యాండ్ బాల్ ఎంపిక పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎం.సంజీవ్ (రామడుగు), ఎన్. ఈశ్వర్ (కాటారం), ఎం.చంటి, బి.దేవేందర్ (గుల్లకోట), బి.వంశీ (గుల్లకోట) ప్రతిభ చాటి క్రీడా హాస్టల్‌కు ఎంపికయ్యారని జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేని లక్ష్మన్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని సంఘం సంయుక్త కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, కోచ్ వెంకటేశ్ అభినందించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడిని కాపాడిన లేక్ పోలీసులు

కరీంనగర్‌క్రైం, ఏప్రిల్ 18 : శంకరపట్నం మండలానికి చెందిన శ్రీనివాస్ గురువారం కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వెళుతుండగా కరీంనగర్ లేక్ అవుట్‌పోస్ట్ పోలీసులు రక్షించారు. శ్రీనివాస్ కుటుంబ సమస్యలతో గురువారం మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్తుండగా లేక్ పోలీసులు అనుమానించి అతడిని అడ్డుకున్నారు. కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అంజన్న దీక్షాపరుడిపై ఆంక్షలు

● ఉద్యోగం నుంచి తొలగించిన ఓ ప్రైవేటు సంస్థ మేనేజర్ ● అంజన్న స్వాముల ఆందోళన

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 18: జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆంజనేయ స్వామి మాల ధరించి విధులకు హాజరవుతున్న ఓ ప్రైవేటు ఉద్యోగి పట్ల మరో ఉద్యోగి ఆంక్షలు విధించాడు. నిబంధనల ప్రకారం బూట్లు వేసుకుని విధులకు హాజరు కావాలని లేకుంటే రావద్దంటూ అభ్యంతరం వ్యక్తం చేశాడు. మధ్నాహ్నం సమయంలో భిక్ష(భోజనానికి)కు అరగంట మాత్రమే సమయమంటూ వేధించాడు. అంతే కాకుండా అసభ్యకరంగా మాట్లాడుతూ ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశాడు. టూల్ కిట్ తీసువచ్చేంత వరకు ద్విచక్రవాహనం ఇవ్వనని దాన్ని స్వాధీనం చేసుకుని ఇబ్బందులకు గురి చేశాడు. దీంతో దీక్షాపరుడు జరిగిన విషయాన్ని వీహెచ్‌పీ, బీజేపీ, అంజన్న దీక్షాపరులకు తెలియజేశాడు. వారు ఆందోళన చేపట్టగా పోలీసులు రంగప్రవేశం చేసి బాధితుడికి సారీ చెప్పించడంతో వివాదం సద్దుమణిగింది. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం సింగరావు పేట గ్రామానికి చెందిన రుద్రారపు నవీన్ అనే యువకుడు జగిత్యాల జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్‌లో ఉన్న జియో ఫైబర్ నెట్‌వర్క్ సర్వీసర్‌గా మూడు నెలలుగా విధులు నిర్వహిస్తున్నాడు. నవీన్ ఆరు రోజుల క్రితం అంజన్న దీక్ష తీసుకుని విధులకు హాజరవుతున్నాడు. అప్పటి నుంచి కంపెనీ మేనేజర్ సురేష్ అసభ్యకరంగా మాట్లాడుతూ అవమానిస్తున్నాడు. మాల ధరించి విధులకు హాజరు కావద్దంటూ అభ్యంతరం వ్యక్తం చేశాడు, కంపెనీ నిబంధనల ప్రకారం షూ వేసుకుని రావాలని, భిక్షకు కేవలం అరగంట సమయం మాత్రమే తీసుకోవాలంటూ ఆంక్షలు విధించాడు. శ్రీరామనవమి రోజున సదరు మేనేజర్ నవీన్‌పై ఉన్న కోపంతో ఉద్యోగం నుంచి తొలగిస్తున్నానని తెలుపడంతో పాటు కంపెనీ టూల్ కిట్ ఇచ్చేంత వరకు ద్విచక్రవాహనాన్ని ఇచ్చేది లేదంటూ


జగిత్యాలలో ధర్నా నిర్వహిస్తున్న అంజన్న స్వాములు

వాగ్వాదానికి దిగాడు. గురువారం నవీన్ అంజన్న భక్తులతో పాటు వీహెచ్‌పీ, బీజేపీ నాయకులకు విషయం తెలిపాడు. ఆగ్రహంతో వారందరూ జియో షోరూం వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. మేనేజర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. చివరికి పోలీసులు రంగప్రవేశం చేసి నాలుగు గంటల అనంతరం మేనేజర్‌తో సారీ చెప్పించడంతో అంజన్న భక్తులు ఆందోళనను విరమించారు. జగిత్యాలలో అంజన్న భక్తుడిని అవమానించిన ఘటనను తెలుసుకున్న నిజామాబాద్ ఎంపీ అర్వింద్ బాధితునితో ఫోన్లో మాట్లాడి ధైర్యం నింపారు. ముంబైలో ఉన్న కంపెనీ యజమానికి ఫోన్ చేసి తిరిగి ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

గంజాయి కట్టడికి కఠిన చర్యలు

● ఖని ఏసీపీ మడక రమేష్

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 18: గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో గంజాయి కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు ఏసీపీ మడక రమేష్ తెలిపారు. గురువారం గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టూటౌన్, కమాన్‌పూర్ స్టేషన్ల పరిధిలో ఈ నెలలో మూడు కేసులు నమోదు చేసి 17 మందిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. వారి వద్ద నుంచి 85,675 విలువ గల 3 కిలోల గంజాయితో పాటు ఒక బైక్, 16 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ తెలిపారు. అరెస్టు అయిన 17 మందిలో వారిలో 9 మంది అమ్మకం దారులు, నలుగురు వినియోగదారులు, ఇద్దరు డీలర్లు, ఒకరు కొరియర్, ఒకరు గంజాయి పండించే వ్యక్తి ఉన్నట్టు ఏసీపీ పేర్కొన్నారు. వీరంతా కమాన్‌పూర్, జూలపల్లి, గోదావరిఖని, సెంటినరీ కాలనీ, మచ్చుపేట, గుంటూరుపల్లెకు చెందిన వారని అన్నారు. పారిశ్రామిక ప్రాంతానికి గంజాయి తీసుకువస్తున్న ముఖ్యమైన వ్యక్తి గొడిశెల శివ(రూట్ శివ)ను అదుపులోకి తీసుకుని విచారించిన మీదట, ఆదిలాబాద్ జిల్లా గడెగూడ మండలం లోకారి గ్రామంలో గంజాయి పండిస్తున్న నాగోరావ్‌ను అరెస్ట్ చేసినట్టు ఏసీపీ తెలిపారు. గొడిశెల శివ, నాగోరావ్‌లను రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసిన ఎస్సైలు సనత్‌కుమార్,


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ రమేష్

వెంకటేష్, కానిస్టేబుళ్ల కృష్ణారెడ్డి, జే రమేష్, వెంకటస్వామి, రామచంద్రంలకు ఏసీపీ అవార్డులను అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పోస్టర్‌ను ఏసీపీ రమేష్ ఆవిష్కరించారు. గంజాయి, కల్తీ కల్లు అమ్మకాలపై టోల్ ఫ్రీ నంబర్ 8712671111 లేదా పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈవిలేకరుల సమావేశంలో సీఐ బీ రవీందర్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 18 : కరీంనగర్ బైపాస్‌రోడ్‌లోని డిల్లీ దాబా వద్ద రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి(55) మృతి చెంది ఉన్నాడని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తించినవారు ఏఎస్‌ఐ చాంద్‌పాషా ఫోన్ నెంబరు 99084 40822, ఒకటో టౌన్ ఫోన్ నెంబరు 8331940591కు సమాచారం అందించాలని కోరారు.

ఆకట్టుకున్న ఎడ్లబండ్ల పోటీలు

గొల్లపల్లి, ఏప్రిల్ 18 : గొల్లపల్లి మండల కేంద్రంలోని రామాలయంలో జరుగుతున్న శ్రీ కళ్యాణ రామచంద్ర స్వామి 33వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల సేవా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన 24 ఎడ్ల బండ్లు పోటీలో నువ్వా..నేనా అన్న రీతిలో చెమటోడ్చాయి. వెల్గటూర్ మండలం జగదేవ్‌పేట గ్రామానికి చెందిన క్యాతం జితేందర్‌కు చెందిన ఎడ్లబండి ప్రథమ విజేతగా నిలిచింది. ద్వితీయ విజేతగా వెన్నుమట్ల గ్రామానికి చెందిన నేరేళ్ల సతీష్‌గౌడ్ నిలిచారు. తృతీయ విజేతగా గొల్లపల్లి మండలం తిర్మలాపూర్ (పీడీ) గ్రామానికి చెందిన షేక్ భాషామియా ఎడ్లబండి నిలిచింది.

వడదెబ్బతో ఒకరి మృతి


గంగారాం (ఫైల్)

చందుర్తి, ఏప్రిల్ 18: రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామారావుపల్లి గ్రామంలో వడదెబ్బతో ఒకరు మృతి చెందారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మట్కం గంగారాం (42) అనే వ్యక్తి గురువారం చందుర్తి మండల కేంద్రంలో పనిపై ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి గ్రామ శివారులోని మామిడి తోట వద్దకు చేరుకొని విశ్రాంతి తీసుకుంటుండగా అస్వస్థతకు గురయ్యాడు. అక్కడే ఉన్న కొందరు వ్యక్తులు వెంటనే ద్విచక్ర వాహనంపై ఆర్‌ఎంపీ వైద్యుని వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గంగారం జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తుర్తి గ్రామం నుంచి జీవనోపాధి కోసం 20 సంవత్సరాల క్రితం గ్రామానికి వచ్చినట్లు తెలిపారు. మృతుడికి భార్య సరోజన, కూతురు ఒక కుమారుడు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్థులు అంత్యక్రియల కోసం విరాళాలు సేకరించారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాహనం తనిఖీ


ఆది శ్రీనివాస్ వాహనంను తనిఖీ చేస్తున్న పోలీసులు

బోయినపల్లి, ఏప్రిల్ 18: హుజూరాబాద్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం ముగించుకొని వేములవాడ వస్తున్న క్రమంలో గురువారం కొదురుపాక చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. వారికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకరించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

కోనరావుపేట, ఫిబ్రవరి 18: మండలంలోని మల్కపేట గుట్టపై నిర్మించిన కోదండరామస్వామి నూతన ఆలయ ప్రాంగణంలో గురువారం నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం చిన్నజీయర్ స్వామి చేతులమీదుగా ప్రాణప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు, చల్మెడ లక్ష్మీనర్సింహారావు తెలిపారు.

అంజన్న భక్తుల కోసం రోడ్డుపై గడ్డితో నడకదారి

మల్యాల, ఏప్రిల్ 18: కొండగట్టు అంజన్న సన్నిధిలో జరుగనున్న చిన్నహనుమాన్ జయంత్యుత్సవాల కోసం వివిధ ప్రాంతాల నుంచి నడిచి వచ్చే వేలాది మంది దీక్షాపరుల కోసం మండలంలోని నూకపల్లికి చెందిన యువకులు రహదారి పక్కన వరిగ్రాసంతో నడకమార్గం ఏర్పాటు చేస్తున్నారు. వేసవి ఎండలు మండి పోతుండడం.. రహదారిపై నడిచే భక్తుల కాళ్లకు బొబ్బలు రావడంతో వరిగ్రాసాన్ని రహదారి పక్కన పేర్చుతూ మార్గం ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం వీఆర్‌కే కళాశాల నుంచి మల్యాల క్రాస్‌రోడ్డు వరకు వరి గ్రాసంతో నూకపల్లికి చెందిన ఆర్మీ శ్రీనివాస్, చందు, స్వామి, జగదీష్, మనీష్, నాంపల్లి, ఆంజనేయులు నడక మార్గం ఏర్పాటు చేస్తుండగా వరి గ్రాసంను కనకట్ల శ్రీనివాస్ సమకూర్చాడు. వరి గడ్డి గాలికి కొట్టుకుపోకుండా దానిపై నీరు చల్లుతున్నారు.


అంజన్న స్వాములు నడిచేందుకు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన గడ్డి

విధుల్లో అలసత్వం వహించిన పోలీసుల సస్పెన్షన్

సారంగాపూర్, ఏప్రిల్, 18: విధుల్లో అలసత్వం వహించినందుకు ఇద్దరు ఎస్‌ఐలతో పాటు హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీసులు గత సంవత్సరం ఫిబ్రవరిలో వాహనాల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 70 కిలోల గంజాయిని సారంగాపూర్ పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న గంజాయిని అదే అంబులెన్స్‌లో ఉంచి పోలీస్‌స్టేషన్లో ఎస్సై రూమ్ సమీపంలో భద్రపరిచారు. కొద్ది రోజుల క్రితం అంబులెన్స్‌లో ఉన్న గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీన్ని గమనించిన పోలీసులు ఉన్నతాధికారులకు విషయాన్ని తెలిపారు. హుటాహుటిన ఎస్పీతో పాటు జిల్లా స్థాయి పోలీస్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేశారు. విధుల్లో అలసత్వం వహించిన అప్పటి ఎస్సై మనోహర్ రావు, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఎస్సై తిరుపతితో పాటు హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుల్ టీ నరేందర్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్ 1 ఐజీ ఎవి రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

రాజన్న కోడెలకు పశుగ్రాసం వితరణ

వేములవాడ టౌన్, ఏప్రిల్ 18: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి తిప్పాపూర్ గోశాలకు పలువురు పశుగ్రాసాన్ని గురువారం అందజేశారు. ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామానికి చెందిన రాజే 1000 కేజీల గ్రాసం అందించగా, వెంకటాపురం గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి 17 వందల కేజీల గ్రాసాన్ని సంబందిత అధికారులకు అందించారు. అంతే కాకుండా శ్రీరాజరాజేశ్వర స్వామి వారి గోశాలకు పశుగ్రాసం అందించాల్సిన దాతలు నాంపల్లి గుట్ట సమీపంలో ఏర్పాటు చేసిన 3వ గోశాలకు తీసుకురావల్సిందిగా అధికారులు విజ్ఞప్తి చేశారు.

నిలిపి ఉన్న వ్యాన్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● 12 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు

గంగాధర, ఏప్రిల్ 18: గంగాధర మండలం కురిక్యాల గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై బుధవారం అర్ధరాత్రి ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డుపై నిలిపి ఉంచిన వ్యాన్‌ను వెనకనుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, కండక్టర్ సహ మరో పది మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై కిరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల డిపోకు చెందిన బస్సు(టీఎస్ 21జడ్ 0011) భద్రాచలం నుంచి కోరుట్లకు వెళ్తోంది. గంగాధర మండలం కురిక్యాల శివారు నుంచి సుమారు రాత్రి రెండు గంటల ప్రాంతంలో బస్సు వెళుతున్నది. ఆ సమయంలో ప్రధాన రహదారిపై నిలిపి ఉంచిన వ్యాను (ఎంపీ 13జీబీ 4566)ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దీంతో బస్సు డ్రైవర్ మహేందర్, కండక్టర్ గంగారాంతో పాటు 10 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం మేరకు ఎస్సై కిరణ్‌రెడ్డి సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని కరీంనగర్‌కు తరలించారు. కోరుట్ల డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేరుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. వ్యాన్‌ను డ్రైవర్ ఇండికేటర్స్ వేయకుండా రోడ్డుపై నిలిపి ఉంచడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు చెబుతున్నారు.


వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

దుబ్బపల్లి వద్ద వాహనాల తనిఖీలు


దుబ్బపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడం, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంకావడంతో సుల్తానాబాద్ మండలంలోని దుబ్బపల్లి వద్ద పోలీసులు తనిఖీలు ప్రారంభించారు. పెద్దపల్లి నియోజకవర్గ సరిహద్దు గ్రామమైన సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఈ చెక్‌పోస్ట్ వద్ద పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. గురువారం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎస్ఐ శ్రావణ్‌కుమార్, పంచాయతీరాజ్ శాఖ అధికారి అనిల్‌రెడ్డి తదితరులు ఈ చెక్‌పోస్టులో వాహనాల తనిఖీలు నిర్వహించారు.

పెట్రోల్ బంకుల్లో అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 18: పెద్దపల్లి పట్టణంలో ఉన్న పలు పెట్రోల్ బంక్‌లలో గురువారం ఉదయం అగ్ని ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. అగ్నిమాపక అధికారి డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని వీఎల్బీ మల్లేశం, విజయలక్ష్మి ఫిల్లింగ్ స్టేషన్, శ్రీరాజరాజేశ్వర ఫిల్లింగ్ స్టేషన్, జకోటియా ఫిల్లింగ్ స్టేషన్‌లో అగ్ని ప్రమాదాల నియంత్రణకు ఏర్పాటు చేసిన ఫైర్‌సేఫ్టీ సిస్టమ్‌ను పరిశీలించారు. అగ్ని ప్రమాదాల నియంత్రణకు అవసరమైన పరికరాలు నిబంధనల మేరకు అందుబాటులో ఉంచుకోవాలని, అగ్ని ప్రమాదాల నేపథ్యంలో వాటిని వినియోగించాల్సిన తీరుపై సిబ్బందికి ప్రదర్శన చేసి చూపించారు. పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రికల్ ఫైర్ జరిగినప్పుడు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై వివరించారు. పెట్రోల్‌పంపుల్లో పనిచేసే సిబ్బందికి ఫైర్ ఎక్స్‌టింగిషర్లు ఎలా వాడాలో పూర్తిగా తెలిసి ఉండాలని, దీనికి సంబంధించి యాజమాన్యం పూర్తి బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మాన్ మహేందర్‌రెడ్డి, డ్రైవర్ ఆపరేటర్ జి.శ్రీనివాస్, పెద్దపల్లి స్టేషన్ అగ్నిమాపక సిబ్బంది శ్రావణ్ కుమార్, ప్రవీణ్ కుమార్, హోమ్ గార్డు ఎండి. అజ్జు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


పెట్రోల్ బంకులో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

గ్యాస్ గోదాంలో..

మంథని, ఏప్రిల్ 15: అగ్నిపమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఇండేన్ గ్యాస్ గోదాం అవరణలో అగ్ని ప్రమాదాల నివారణపై సిబ్బందికి గురువారం మంథని ఫైర్ స్టేషన్ అధికారుల బృందం అవగాహన కల్పించారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించే తీరు, అవి జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు జాగ్రత్తలపై ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎస్. సదానందం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇండేన్ గ్యాస్ గోదాం మేనేజర్ వాసు, ఫైర్ సిబ్బంది ఎల్ఎఫ్ఆర్ అశోక్, డీవోపీ కుమారస్వామి, ఎఫ్ఎం శ్రీనివాస్, హెచ్‌జీ కోండ్ర నాగరాజులు పాల్గొన్నారు.

బీడు భూములను సస్యశ్యామలం చేస్తాం

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ధర్మపురి, ఏప్రిల్ 18: గోదావరి జలాలతో బీడు భూములను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ధర్మపురిలోని శ్రీ లక్ష్మీ నరసింహ గార్డెన్స్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కొప్పుల ఈశ్వర్ పార్లమెంట్ ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని ఓ ట్లు అడుగుతారని ప్రశ్నించారు. గడ్డం వంశీకృష్ణ మంచి సేవాభావం కలిగి ఉన్న వ్యక్తి అన్నారు. వంశీకృష్ణ గెలుపు కోసం ఏడు అసెంబ్లీ నియో జకవర్గాల ప్రజలు కృషి చేయాలని అన్నారు. వంశీకృష్ణను ఇక్కడి ప్రజలు భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించాలని కోరారు. పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ వస్తే ఏదో జరుగుతుందనే ప్రజల ఆశలు నీరు గారిపోయాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నెలకొన్న తాగు, సాగు నీటి సమస్యను సీఎం రేవంత్‌రెడ్డికి తనతో పాటు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కలిసి తీసుకువెళ్లినట్లు తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కారం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన వివరించారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ అబద్ధాలు, మోసాలతో పది ఏళ్ల పదవీలో కొనసాగిన సీఎం కేసీఆర్ ప్రజా ధనాన్ని దోచుకున్నట్లు ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు ఓటు అడిగే హక్కు లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

'ఒంటెద్దు పోకడ సరికాదు'

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 18: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఒంటెద్దు పోకడలతో వ్యవహరిస్తున్నారని, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తమ సంస్థ స్థలంలోని చెట్లను ఎలా తొలగిస్తారని గోదావరి ప్రదూషణ పరిహరణ పర్యావరణ పరిరక్షణ గవాక్షం(జీపీపీపీపీజీ) వ్యవస్థాపక స భ్యుడు గుమ్మడి కుమారస్వామి ప్రశ్నించారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో 24ఏళ్ల క్రితం రామాలయం వద్ద జీపీపీపీపీజీ ఎన్‌జీవోకు 39గుంటల స్థలాన్ని, ఒక గదిని అప్పటి సీఎండీ ఏపీవీఎన్ శర్మ కేటాయించారని, 39గుంటల స్థలంలో వనమూలికలతో పాటు ఇతర చెట్లను పెంచామన్నారు. ఈనెల 12న ఎలాం టి నోటీసులు ఇవ్వకుండా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సింగరేణి ఎస్టేట్ అధికారులు కూల్చివేశారని, అంతేకాకుం డా గేటును, పంపుసెట్‌ను ఎత్తుకెళ్లారని, వీటితోపాటు విలు వైన మొక్కలను కూడా ఎత్తుకెళ్లారని ఆరోపించారు. ఇందు లో భాగస్వాములైన శానిటరీ సూపర్‌వైజర్లను, ఇన్‌స్పెక్టర్ల ను వదిలేది లేదని, ప్రజలకు జవాబుదారిగా ఉండాల్సిన కమిషనర్ ఎలాంటి నోటీసులు లేకుండానే కూల్చివేశారని ఆరోపించారు. అభివృద్ధి పేరిట దౌర్జన్యాలకు దిగడం సరైంది కాదని, తాము అభివృద్ధి విరోధకులం కాదని, ప్రజాభిప్రాయ సేకరణ తదుపరి కార్యక్రమం చేపట్టాల్సి ఉండగా కమిషనర్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదన్నారు. గోదావరి పక్కనే ఉన్నా సింగరేణి కార్మికులు, కార్పొరేషన్‌లో నివసిస్తున్న ప్రజలకు నీళ్లు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారని, ఇప్పటికే ఎల్లంపల్లిలో నీటి మట్టం తగ్గిందని, ప్రతి రోజు తాగునీరు ఇవ్వాల్సి ఉండా మూడు రోజులకోసారి ఇస్తున్నా రని, గోదావరి పక్కనే ఉన్నా గోదావరి నీటిని స్థానికులకు ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలించుకుపోతున్నారని, దీని పై మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు మాట్లాడడం లేదని ఆయన ప్రశ్నించారు. మరో పది రోజుల్లో నీటి కటకట మొ దలవుతుందని, దీనికి అధికారులు ఏం సమాధానం చెబు తారని ఆయన ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో ఎల్ రాజయ్య, ఎరుకల నాగరాజు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 18: విశ్వబ్రాహ్మణులకు అండగా ఉంటానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గురువారం గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌లోని విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం భవనంలో నూతనంగా నిర్మించిన బాంక్వెట్ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు తన గెలుపులో భాగస్వాములుగా ఉన్నారని, వారికి ప్రభుత్వపరంగా రావాల్సిన సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. విశ్వబ్రాహ్మణులు ఏ సమస్య వచ్చినా తనను నేరుగా సంప్రదించవచ్చన్నారు. అనంతరం విశ్వబ్రాహ్మణులు మక్కాన్‌సింగ్‌ను ఘనంగా సన్మానించారు. కాగా, విశ్వబ్రాహ్మణ సంఘానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, బాల రాజ్‌కుమార్, నాయకులు ఆడెపు దశరథం, తిప్పారపు శ్రీనివాస్, అడ్డాల రామస్వామి, యాకూబ్, నాగరాజు, నారాయణ పాల్గొన్నారు.

చట్టాల సవరణ వల్ల కార్మిక రంగానికి నష్టం

ఐఎన్‌టీయూసీ నేత బాబర్ సలీం పాషా

జ్యోతినగర్, ఏప్రిల్ 18 : దేశంలో కార్మిక చట్టాల సవరణ వల్ల కార్మిక రంగానికి తీరని నష్టం వాటిల్లుతుందని ఐఎన్‌టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి, ఎన్టీపీసీ ద్వైపాక్షిక సంఘం(ఎన్‌బీసీ) సభ్యుడు బాబర్ సలీంపాషా అన్నారు. ఇండోనేషియా రాజధాని జకర్తాలో రెండు రోజులపాటు జరిగిన అంతర్జాతీయ కార్మిక సంఘం(ఐ ఎల్‌వో) సదస్సులో బాబర్ సలీంపాషా పాల్గొన్నారు. గురువారం చివరి రోజు ఐఎన్ టీయూసీ తరపున ప్రాతినిధ్యం వహించిన ఆయన ప్రసంగించారు. నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి 4 లేబర్ కోడ్లను తీసుకవస్తోందన్నారు. లేబర్ కోడ్ల వల్ల కార్మికుల సమ్మె హక్కును కోల్పోతారని, చట్టబద్ధమైన అనేక హక్కుల్ని కోల్పోవాల్సి వస్తుం దన్నారు. అలాగే కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని పర్యవేక్షించే వ్యవస్థ(ఎన్‌ఫోర్స్‌మెంట్) నిర్వీర్యమవుతుందని, కంపెనీల యాజమాన్యాలకు ప్రయోజనం చేకూరేలా లేబర్ కోడ్లను తీసుకవచ్చారన్నారు. కార్మికులతో పాటు కార్మిక సంఘాలు(ట్రేడ్ యూనియన్లు) సైతం లేబర్ కోడ్ల వల్ల ఉనికి లేకుండాపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాల సవరణ ఐఎల్‌వో కన్వెన్షన్ 144కు వ్యతిరేకమని జాతీయ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సదస్సు దృష్టికి తెచ్చిందన్నారు. గత పదేళ్లుగా భారతదేశంలో ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్(ఐఎల్‌సీ)లను మోదీ సర్కారు నిర్వహించడం లేదని విమర్శించారు. చట్టాల సవరణ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశంలోని అన్ని కార్మిక సంఘాల ఐక్యంగా ఉద్యమిస్తున్నాయన్నారు. సదస్సులో వివిధ దేశాల ఐఎల్‌వో ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడతున్న బాబర్ సలీం పాషా



కొత్త గనులు, నియామకాల కోసం కృషి

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 18: వచ్చే నాలుగేళ్ళలో కొత్త గనుల ప్రారంభించడం, 15వేలకు పైగా నియామకాలు చేపట్టే దిశగా ఐఎన్‌టీయూసీ కృషి చేస్తున్నట్టు యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ తెలిపారు. గురువారం ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, సింగరేణిలో ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్‌టీయూసీ గెలిచిన తర్వాత పెండింగ్‌లో ఉన్న పలు పనులు పూర్తిచేసినట్టు తెలిపారు. 422 మంది డిపెండెంట్లకు, 127 మంది క్లరికల్ సిబ్బందికి నియామక పత్రాలు అందజేసినట్టు పేర్కొన్నారు. డిపెండెంట్ల వయస్సు 40ఏళ్లకు పెంచేలా యాజమాన్యాన్ని ఒప్పించినట్టు తెలిపారు. రామగుండం రీజియన్, శ్రీరాంపూర్ ఏరియాల కార్మిక వాడలకు మంచి నీటి సరఫరాకు 22 కోట్లతో ర్యాపిడ్ గ్రావిటీ శుద్ధి ప్లాంట్ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మంజూరుచేయించినట్టు పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రాంత నిరుద్యోగ సమస్య పరిష్కారానికి అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళనున్నామని తెలిపారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులతో పాటు రాష్ట్రంలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు న్యాయమైన వేతనాలు అందేలా కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం సహకారంతో రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు, జైపూర్ విద్యుత్‌ప్లాంట్‌లో అదనంగా 800 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేయన్నామని తెలిపారు. ఈనెల 22న గోదావరిఖని బృందావన్ గార్డెన్స్‌లో ఐఎన్‌టీయూసీ డెలిగేట్స్ మహా సభ నిర్వహించనున్నామని, దీనికి జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి హాజరుకానున్నట్టు జనక్‌ప్రసాద్ తెలిపారు. ఈవిలేకరుల సమావేశంలో సత్యనారాయణరెడ్డి, అక్రం, శంకర్‌నాయక్, దశరథం, వికాస్, సదానందం, ఎట్టెం కృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, రమేష్, నవీన్‌కుమార్, అంజయ్య పాల్గొన్నారు.

సెక్యూరిటీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

రామగిరి, ఏప్రిల్ 18: సింగరేణి ఆర్జీ-3 ఎస్అండ్‌పీసీ సిబ్బంది సమస్యలపై ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి గురువారం ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల విధుల సమయంలో స్పెషల్ లీవ్ ఇవ్వడం మూలంగా సెక్యూరిటీ గార్డులు సుమారు రూ.10వేలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఓసీ పీ-2 స్టోర్‌లో ఫ్యాన్లు లేని కారణంగా సెక్యూరిటీ గార్డులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సెక్యూరిటీ పోస్టులలో కూలర్‌లను ఏర్పాటు చేయాలని, పర్మినెంట్ చెక్ పోస్టుల నిర్మాణం చేపట్టాలని వినతిలో పేర్కొన్నారు.

కార్మికులపై బీఆర్ఎస్ మొసలి కన్నీరు

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఏప్రిల్ 18: సింగరేణి కార్మికులపై బీఆర్ఎస్ మొసలి కన్నీరు కారుస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆరోపించారు. గురువారం ఆర్జీ-1 పరిధిలోని జీడీకే 11ఇంక్లైన్‌పై కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏ రోజు కూడా కార్మికుల సమస్యలు పట్టించుకోలేదని, అప్పుడు కార్మికుల కష్టాలు కనబడలేదా అని ప్రశ్నించారు. కార్మిక నాయకునిగా అనుభవం ఉన్న కొప్పుల ఈశ్వర్ ఏ రోజైనా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారా అని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగటానికి వస్తున్నాడని ప్రశ్నించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కార్మికులు, ప్రజలు, కార్మికులు చరమగీతం పాడనున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాల వయోపరిమితి 35సంవత్సరాల నుంచి 40సంవత్సరాలకు వెసులుబాటు కల్పించడం జరిగిందని, త్వరలోనే సింగరేణి ఆధ్వర్యంలో 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నారని, కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి వచ్చిన లాభాల్లో రామగుండంలో రూ.500కోట్లతో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడం జరిగిందని, దీనికి సింగరేణి మెడికల్ కాలేజీగా నామకరణం చేయడం జరిగిందన్నారు. ఎన్నికలు అయిపోయిన తరువాత కార్మికుల సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ, మేయర్ బంగి అనీల్‌కుమార్, ఐఎన్‌టీయూసీ నాయకులు జనక్ ప్రసాద్, కాల్వ లింగస్వామి, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, కాంగ్రెస్ నాయకులు పెద్దెల్లి ప్రకాష్, తిప్పారపు శ్రీనివాస్, గట్ల రమేష్, పెంచాల తిరుపతి, గడ్డం కృష్ణ, పుట్ట రమేష్ పాల్గొన్నారు.

సీహెచ్‌పీ సమస్యలను పరిష్కరించండి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 18: ఓసీపీ-3 సీహెచ్‌పీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ యాజమాన్యాన్ని కోరారు. గురువారం సీహెచ్‌పీని సందర్శించి, కార్మికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెచ్‌ఓడీతో సమస్యలపై చర్చించారు. వివిధ యంత్రాల వద్ద పనిచేస్తున్న ఫిట్టర్, ఎలక్ట్రిషియన్లకు సరైన పనిముట్లు ఇవ్వకపోవడంతో దెబ్బలు తగులుతున్నాయని, వారికి అవసరమైన నాణ్యమైన పనిముట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. టెక్నీషియన్లు, వివిధ డిసిగ్నేషన్‌లలో తక్కువ మ్యాన్ పవర్ ఉన్నందున ఉన్న వారిపై అధిక పని భారం పడుతుందని, ఐఈడీ ప్రకారం మ్యాన్ పవర్‌ను భర్తీ చేయాలని కోరారు. ఫీడర్స్, జీఎల్ బంకర్ లలో సరైన వెంటిలేషన్ లేని కారణంగా దుమ్ముతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, హై కెపాసిటీ వెంటిలేషన్ ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఫ్లో ఫీడర్ సరైన మెయింటనెన్స్ లేక అత్యధికంగా బొగ్గు వాపస్ వస్తున్నదని, ఇక్కడ పనిచేయడానికి కార్మికులు ఇష్టపడడం లేదని హెచ్‌ఓడీకి తెలిపారు. సరైన మెయింటనెన్స్ చేయించాలని కోరారు. దుమ్ములో పనిచేసే కార్మికులు పని ముగించుకుని వెళ్ళే సమయంలో స్నానానికి అనువుగా గ్రీజర్లు ఏర్పాటు చేయాలని జనక్‌ప్రసాద్ కోరారు. జనక్ ప్రసాద్ వెంట సత్యనారాయణరెడ్డి, అక్రం, ఎట్టెం కృష్ణ, మండ రమేష్, నవీన్ ఉన్నారు.


సీహెచ్‌పీ ఇన్‌చార్జితో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

కళాభవన్ నిర్మాణానికి కృషి చేస్తా

-ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కళాకారులు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 18: గోదావరిఖనిలో కళాభవన్ నిర్మాణానికి కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కళాకారులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌లో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పర్యటించగా కళాకారులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. 2019లో భూమిపూజ జరిగిందని, కాంట్రాక్టర్ మరణంతో ఆగిపోయిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు కళాభవన్ నిర్మాణం జరగలేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ కళాభవనాన్ని నిర్మించి అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కనకం రమణయ్య, నాగుల శ్రీనివాస్, శశిభూషన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 18: శ్రీచైతన్య డిఫెన్స్, స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో డిఫెన్స్ పారామిలిటరీ విభాగాలలో ఉద్యోగాల కోసం సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు శనివారం గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు అకాడమీ ప్రిన్సిపల్ పల్లె శ్యాంసుందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 8 మంది వైద్యులు, మాజీ సైనికుల ఆధ్వర్యంలో దాదాపు 18 రకాల వైద్య పరీక్షలు పూర్తిగా ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని 10వతరగతి, ఇంటర్మీడియట్ పూర్తి అయిన విద్యార్థులు, ఆర్‌పీఎఫ్, పారామిలిటరీ(ఎస్ఎస్‌సీ-జీడీ), డిఫెన్స్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న ప్రతి ఒక్క అభ్యర్థి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం, రిజిస్ట్రేషన్ కోసం సెల్. 8309435264, 9055644400, 8886304040, 9652615525 సంప్రదించాలని కోరారు.

మహిళా ఫొటోగ్రాఫర్ వివాహానికి చేయూత

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 18: గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన నిరుపేద మహిళా ఫొటోగ్రాఫర్ పులి శైలజ వివాహానికి ఖని ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ నుంచి సేకరించిన రూ.84,866 గురువారం అందజేశారు. వివాహ వేదికపై నూతన దంపతులకు అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి భాస్కర్, ప్రధాన కార్యదర్శి శనిగరపు మల్లేష్, కోశాధికారి బండారి ప్రసాద్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తోగటి శ్రీధర్, రామగిరి శ్రీనివాస్, గాండ్ల శ్రీనివాస్, ఎలగందుల శ్రీనివాస్, బాధ్యులు కోడి రామకృష్ణ, రెడ్డి శ్యాంప్రసాద్, మోర విక్రమ్, జానకిరామ్, తులసి, లలిత, లావణ్య, రెడ్డి రోజారాణి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలి

ఓదెల, ఏప్రిల్ 18: నేత్రదానం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని సదాశివ ఫౌండేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మచారి అన్నారు. మండల కేంద్రంలో అనారోగ్యంతో నంది శంకరయ్య మృతిచెందగా, ఆయన నేత్రాలను గురువారం కుటుంబ సభ్యులు ఫౌండేషన్‌కు దానం చేశారు. అనంతరం గోదావరిఖని టెక్నీషియన్ రాజయ్య ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి హైదరాబాదులోని ఐ బ్యాంకుకు పంపించారు. ఈ కార్యక్రమంలో తుమ్మ మధుకర్, క్యాతం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, వేణు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సమాజ్‌వాదీ పార్టీకి రాజీనామా

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 18:సమాజ్‌వాదీ పార్టీకి పలు మండలాలకు చెందిన అధ్యక్షులు రాజీనామా చేశారు. సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు సదానందం యాదవ్, పెద్దపల్లి మండల అధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్ యాదవ్, జూలపల్లి మండల అధ్యక్షుడు మారం వెంకటరమణ యాదవ్, ఎలిగేడు మండల అధ్యక్షుడు తంగేళ్ల శ్రీనివాస్ యాదవ్, కాల్వ శ్రీరాంపూర్ మండల అధ్య క్షుడు తాత రాజుయాదవ్, ఓదెల మండల అధ్యక్షుడు ఐలయ్య యాదవ్‌లు గురువారం సమాజ్‌వాదీ పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ్‌వాదీ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. పార్టీ సిద్ధాంతాలకు, ఎజెండా అంశాలకు పనిచేయలేకపోతున్నామని వారు ఈసందర్భంగా పేర్కొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌కు రాజీనామాలను పంపించి ఆమోదించాలని కోరినట్లు వారు తెలిపారు.

నియామకం

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 18: కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ కిసాన్ మోర్చా కరీంనగర్ పార్లమెంటు ఇన్‌చార్జిగా యటా మల్లారెడ్డి నియామకమయ్యారు. ఈమేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా యాట మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి పథకాలను ప్రవేశపెట్టిందో వివరిస్తూ కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పెద్దపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భూషణవేణి సురేష్‌గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి దొడ్డుపల్లి జగదీష్, పెద్దపల్లి మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు నేతట్ల కుమార్ యాదవ్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ కొండి సతీష్, కాంగ్రెస్ నాయకులు యాట సంగీత్‌రెడ్డి మల్లారెడ్డికి అభినందనలు తెలిపారు.

●సుల్తానాబాద్, ఏప్రిల్ 18: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ఎస్సీ విభాగం ఎన్నికల ఇన్‌చార్జిగా జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు కలువల శ్రీనివాస్‌ను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రీతమ్ నగరి ఒక ప్రకటనలో తెలిపారు. కాగా తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి శ్రీధర్‌బాబుకు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ప్రీతమ్ లకు కలువల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి


ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఎలిగేడు, ఏప్రిల్ 18: ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌక్ వరకు నిర్వహించిన ఓటర్ అవగాహన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు అమూల్యమైనది అన్నారు. 18ఏళ్లు నిండిన యువతీ యువకులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ర్యాలీ అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, పీఆర్ఏఈ జగదీశ్వర్, గ్రామ బూత్ లెవల్ ఆఫీసర్స్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహించాలి

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 18: కరీంనగర్‌లో ప్రతి సంవత్సరం నిర్వహించే ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించాలని ఒలంపిక్ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సంఘం కోశాధికారి నాగిరెడ్డి సిద్దారెడ్డి సభ్యులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. సమ్మర్ కోచింగ్ శిబిరాలతోపాటు కోచ్‌ల గౌరవ వేతనాన్ని కూడా అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మంత్రిని కోరారు. జిల్లా కలెక్టర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.